సాక్షి
చిత్తూరు
శనివారం । 8 । ఏప్రిల్ । 2023



రాహుకాల అభిషేకాలు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం రాహుకాల అభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు.



కిక్కిరిసిన కాణిపాకం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం శుక్రవారం భక్తులతో కిక్కిరిసింది.

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	36	22
తిరుపతి	37	22
తిరుమల	37	22
గూడూరు	32	18
నగరి	37	24

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శనివారం(సా)	సహర్ ఆదివారం(ఉ)
తిరుపతి	6.28	4.44
చిత్తూరు	6.30	4.43
పుంగనూరు	6.32	4.47

మళ్లీ నువ్వే రావాలి!

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సమరోత్సాహం కనిపించింది. వాడవాడలా 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్' నినాదం మార్మోగింది. పల్లెపట్టణం తేడాలేకుండా పార్టీ నేతలు, కార్యకర్తలు, గృహసారథులతో హోరెత్తింది. గడపగడపకూ వెళ్లి సంక్షేమ పథకాలు వివరించడం.. సమస్యలు తెలుసుకోవడం.. అందులో వీలున్నవాటిని అక్కడికక్కడే పరిష్కరించడం ప్రజల్లో సంతోషాన్ని నింపింది. నేతలు సైతం హోదాలు పక్కనబెట్టి పార్టీ సంచులతో కలియతిరుగుతూ గడపగడపకు వెళ్లి స్టిక్కర్లు అంటించడం అక్కచెల్లెమ్మల మోములో సంతోషం నింపింది. ఇన్నాళ్లూ తోబుట్టువుగా ఆదుకుంటున్న జగనన్న మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షించడం నేతలకు సైతం ఆనందాన్నిచ్చింది.

- ఉమ్మడి జిల్లాలో అట్టహాసంగా 'జగనన్నే మా భవిష్యత్తు'
- ఊరూవాడా మార్మోగిన 'మానమ్మకం నువ్వే జగన్'
- క్షేత్ర స్థాయిలో ప్రజాప్రతినిధులు, కార్యకర్తల విస్తృత పర్యటన
- స్టిక్కర్లు అంటిస్తూ..సమస్యలు తెలుసుకుంటూ ముందుకు
- బాబు మోసం.. జగనన్న మంచిని బేరీజు వేసుకోవాలని సూచన



పుంగనూరు : భగత్‌సింగ్ కాలనీలో ఓ ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి, తిరుపతి: 'జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విశేష స్పందన లభించింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు శుక్రవారం అన్ని నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాలతో పాటు గ్రామస్థాయిలో 'జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జగనన్న పాలనలో అందుతున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. బాబు హయాంలో జరిగిన మోసాలనూ వివరించారు. రెండింటినీ బేరీజు వేసుకోవాలని అభ్యర్థించారు. రాబోయే కాలంలో మరింత అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని సూచించారు. 2024 ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి మరోమారు జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

- పుంగనూరులోని భగత్‌సింగ్ నగర్ కాలనీలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అంటించారు. చంద్రబాబు చేసిన ద్రోహం .. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును వివరించారు. అదేవిధంగా సీఎం సెల్ ఫోన్‌కు స్థానికుల చేత మిస్డ్‌కాల్ చేయించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? ప్రభుత్వ పనితీరు ఎలా ఉంది? అని ప్రతిఒక్కరినీ అడిగి తెలుసుకున్నారు.
- కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని సామగుట్టపల్లి గ్రామంలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వం పనితీరు ఎలా ఉంది? అని అడిగి తెలుసుకున్నారు.
- చిత్తూరు నగర పరిధిలోని సంతపేటలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పార్టీ బ్యాగు తగిలించుకుని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలును అడిగి తెలుసుకున్నారు.
- పూతలపట్టు నియోజకవర్గం, బంగారుపాళ్యం, ఐరాల మండలాల్లో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.
- పలమనేరు పట్టణం, ఎద్దులసంత వీధిలో ఎమ్మెల్యే వెంకటేగౌడ్ ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటించారు.
- గంగాధరనెల్లూరు నియోజకవర్గం, శ్రీరంగరాజపురంలో ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని ప్రారంభించారు.
- నగరి నియోజకవర్గం, వడమాలపేట మండలం, పూడి గ్రామంలో మంత్రి ఆర్కే రోజా 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

ఎలుగెత్తి చాటిన ఊరూవాడా

'జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఓ వైపు ప్రారంభిస్తే.. మరో వైపు ఊరూరా స్థానిక నాయకులు, గృహసారథులు, వలంటీర్లు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపారు. నివాసాలకు సీఎం వైఎస్ జగన్ ఫొటోతో కూడిన స్టిక్కర్లను అంటించారు. పలువురు తమ మొబైల్ ఫోన్లకు స్టిక్కర్లు అంటించుకుని మురిసిపోయారు.



చిత్తూరు : స్టిక్కర్ అంటిస్తున్న ఎమ్మెల్యే ఆరణి



పూతలపట్టు : బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే బాబు



పలమనేరు : స్టిక్కర్ అంటించిన ఎమ్మెల్యే వెంకటేగౌడ



ఎస్ఆర్‌పురంలో ప్రజలతో మమేకమవుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి



నగరి : ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి రోజా



కుప్పం : జగనన్నే మా భవిష్యత్ బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

న్యూస్‌రీల్

నేత్ర వైద్యశిబిరంలో అన్నవితరణ



రోగులకు భోజనం వడ్డిస్తున్న సెల్వమణి

నగరి : పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రోజా చారిటబుల్ ట్రస్ట్, శంకర నేత్రాలయ వారు నిర్వహిస్తున్న కంటి వైద్యశిబిరంలో ఐదోరోజు శుక్రవారం సుమారు 400 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరికి మంత్రి రోజా నివాసం వద్ద భోజన సౌకర్యం కల్పించారు. రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి స్వయంగా అందరికీ భోజనం వడ్డించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, కమిషనర్ వెంకటరామిరెడ్డి, వైస్ చైర్మన్ బాలన్, ఆస్పత్రి కమిటీ డైరెక్టర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల బాహాబాహి

– బీఎన్‌ఆర్‌పేట స్టేషన్‌లో ఫిర్యాదు

చిత్తూరు రూరల్: మండలంలోని బీఎన్‌ఆర్‌పేటలో శుక్రవారం ఇద్దరు టీడీపీ కార్యకర్తలు బాహాబాహీకి దిగారు. మా నాయకుడినే విమర్శిస్తావా..అంటూ ఓ కార్యకర్త మరో కార్యకర్తను పిడుగుద్దులు గుద్దాడు. దీంతో దెబ్బలు తిన్న వ్యక్తి పోలీసులను ఆశ్రయించాడు. వివరాలు.. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ భర్త చంద్రప్రకాష్‌కు సంబంధించి వాట్సాప్ గ్రూపులో ఓ ఫోటో పెట్టారు. దీనిపై బీఎన్‌ఆర్ పురానికి చెందిన తారపతి అనే టీడీపీ కార్యకర్త ''ఇన్ని రోజులు కనపడని నాయకులు అందరూ ఇప్పుడు బయటికి వస్తారు. తెల్లటి ఖద్దరు చొక్కాలతో.. రంగు రంగుల ఫ్లెక్సీలతో.. తస్మాత్ జాగ్రత్త'' అంటూ కౌంటర్ ఇచ్చినట్లు పోస్ట్ పెట్టారు. దీనిపై చంద్రప్రకాష్ వర్గానికి చెందిన చల్లా అనే కార్యకర్త మండిపడి తారపతిని చితకబాదాడు. దీంతో బాధితుడు బీఎన్‌ఆర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట సుబ్బమ్మ తెలిపారు.

అమ్మవారిసేవలో ప్రముఖులు



అమ్మవారి ఆలయం వద్ద హైకోర్టు సీజే ప్రశాంత్ కుమార్ మిశ్రా దంపతులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్‌మిశ్రా కుటుంబ సమేతంగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ వద్దకు చేరుకున్న ఆయనకు జేఈఓ వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, జేఈఓ వీరబ్రహ్మం తీర్థ ప్రసాదాలను అందజేశారు. అదేవిధంగా కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, శ్రీలంక మంత్రి అరుంధిక ఫెర్నాండో వేర్వేరుగా కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు.

తిరుమలలో భక్తుల రద్దీ



భక్తులతో కిక్కిరిసిన క్యూ

తిరుమల : వరుస సెలవుల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. తిరుమల నడకదారులతోపాటు ఏటీసీ, నారాయణగిరి, గోగర్భం డ్యాం, రింగ్ రోడ్డు వద్ద క్యూలు కిక్కిరిసిపోయాయి. అద్దె గదులు దొరక్క భక్తులు ఆరు బయట సేదతీరుతున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు



పుంగనూరు : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పార్టీలో చేరిన నాయకులు

పుంగనూరు : పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీకి చెందిన 50 మంది టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో శుక్రవారం చేరారు. స్థానిక నాయకులు శ్రీనివాసులురెడ్డి, చంద్రారెడ్డి ఆధ్వర్యంలో వారు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిశారు. మంత్రి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో భానుప్రకాష్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, మల్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, మోహన్‌రెడ్డి, రమణారెడ్డి, గోవిందప్ప, శ్రీనివాసులు, గురుమూర్తి, రవికుమార్, మంజునాథ్, మోహన్, గట్టప్ప, సుబ్రమణ్యం, శంకర్, వీరభద్రస్వామి, అనిగరప్ప, హరి ఉన్నారు.

మానవాళి సుఖసంతోషాలకే మహాయాగం



యాగపూజల్లో మంత్రి రోజా

రామచంద్రాపురం: సర్వ మానవాళి సుఖసంతోషాల కోసమే మహాయాగం నిర్వహిస్తున్నట్లు శ్రీశక్తిపీఠం వ్యవస్థాపకులు, కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి తెలిపారు. రాయలచెరువుకట్ట సమీపంలోని శ్రీశక్తి పీఠంలో జరుగుతున్న స్వర్ణాకర్షణ భైరవ లక్ష్మీ కుబేర మహాయాగంలో భాగంగా శుక్రవారం మాతాజీ శ్రీ రమ్యానంద భారతి ప్రత్యేక హోమం నిర్వహించారు. మంత్రి రోజా, సీఐడీ ఎస్పీ సరిత పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా 'అగ్రి ల్యాబ్'

- పక్కా పరీక్షలతో నకిలీ విత్తనాలు.. ఎరువులకు చెక్
- నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులే లక్ష్యం
- జిల్లాలో ఆరు చోట్ల డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు
- నగరిలో ఇప్పటికే ప్రారంభం.. వివిధ దశల్లో మిగిలినవి

నకిలీ విత్తనాలు.. ఎరువులు.. ఆరుగాలం కష్టించే అన్నదాతను నిలువునా ముంచేస్తాయి. వ్యయప్రయాసలకోర్చి పంట సాగు చేస్తే అప్పుల ఊబిలోకి నెట్టేస్తాయి. ఆశించిన దిగుబడి సంగతి దేముడెరుగు.. అసలుకే ఎసరు తెచ్చేస్తాయి. ఇలా రైతులను దగా చేస్తున్న నకి'లీలల'కు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తోంది. అందులో భాగంగా డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. విత్తనాలు.. ఎరువుల.. పురుగుమందులను పక్కాగా పరీక్ష చేయిస్తోంది. తద్వారా కర్షకుడు నాణ్యమైన పంట ఉత్పత్తులు సాధించేందుకు పూర్తి సహకారం అందిస్తోంది. ఈ మేరకు వ్యవసాయరంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ముందడుగు వేస్తోంది.

నగరి : రాయలసీమ పరిధిలో 48 అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో జిల్లాకు 6 ల్యాబ్‌లు కేటాయించింది. వీటిలో ముందుగా నగరిలో 2021, జూలైలోనే ప్రప్రథమంగా తొలి ల్యాబ్ ప్రారంభమైంది. పలమనేరులో నిర్మించిన అగ్రి ల్యాబ్ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. చిత్తూరులోని జిల్లా అగ్రిల్యాబ్ నిర్మాణం తుదిదశలో ఉంది. అలాగే పెనుమూరు, సోమలలో సైతం రెండు ల్యాబ్‌లు నిర్మాణంలో ఉన్నాయి. కుప్పం, తవణంపల్లెలో స్థల సేకరణ, టెండర్ల ప్రక్రియ జరుగుతోంది.

నాణ్యతకు పరీక్ష

రైతులు తాము కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల నాణ్యతపై సందేహాలు వస్తే అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో పరీక్షల చేయించుకోవచ్చు. నాణ్యమైనవి అని నిర్ధారించుకున్న తర్వాతే వినియోగించుకోవచ్చు. గతంలో ఇలాంటి పరీక్షకు తాడేపల్లిగూడెం, హైదరాబాద్‌లోని ల్యాబ్‌లపై ఆధారపడాల్సి వచ్చేది. అప్పట్లో టెస్ట్ రిపోర్టు రైతుకు అందేసరికి కనీసం నెలకు పైగా పట్టేది. ప్రస్తుతం ఏర్పాటైన వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లలో రెండు నుంచి మూడు రోజుల్లోపే ఎరువులకు సంబంధించిన రిపోర్టు, వారం నుంచి పది రోజుల్లోపు విత్తనాల నివేదికలు అందిస్తున్నారు. వీటి కోసం ఒక్కో టెస్టింగ్ ల్యాబ్‌లో ముగ్గురు అనలిస్టులు, ఒక ఏఓ, పర్యవేక్షణకు ఏడీఏ నియమించారు.

ఇప్పటివరకు 359 పరీక్షలు

నగరిలో ఏర్పాటుచేసిన వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో ఇప్పటివరకు 359 పరీక్షలు చేశారు. వీటిలో విత్తనాల నాణ్యతకు సంబంధించి యాక్ట్ శాంపిల్స్ 186 పరీక్షించగా వాటిలో 2 నాణ్యతలేనివని గుర్తించారు. రైతులు తెచ్చిన శాంపిల్స్ 32 పరీక్షించగా వాటిలో 4 నాణ్యత లేనివని గుర్తించారు. ట్రేడ్ శాంపిల్స్ 7 పరీక్షించగా అవి అన్నీ నాణ్యమైనవిగా తేల్చారు. ఎరువులకు సంబంధించి 117 యాక్ట్ శాంపిల్స్, రైతులు తెచ్చిన 12 శాంపిల్స్, ట్రేడ్ శాంపిల్స్ 5 పరీక్షించగా అన్నీ సరిగా ఉన్నట్లు నిర్ధారించారు.



నగరిలోని వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్



విత్తనాల నాణ్యతను పరీక్షిస్తున్న దృశ్యం

పకడ్బందీగా విత్తనాలు, ఎరువుల టెస్టింగ్

ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాలు, ఎరువులకు సంబంధిత పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. పలు ప్రాంతాల్లో వీటిని సేకరించే అధికారులు వాటిని పరీక్షలకు ఎక్కడకు పంపిస్తారో ఎవ్వరికీ తెలియని విధంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. యాక్ట్ శాంపిల్స్ కింద ఇతర జిల్లాల్లోని టెస్టింగ్ ల్యాబ్‌లకు పంపి వాటి నాణ్యతను తెలుసుకుంటున్నారు. పరీక్షించే వారికి కూడా అవి ఎక్కడి నుంచి వచ్చాయన్న వివరాలు తెలియకుండా చర్యలు చేపడుతున్నారు.

విత్తన, ఎరువుల పరీక్ష ఇలా..

టెస్టింగ్ ల్యాబ్‌కు వచ్చే విత్తనాలను తొలుత సీడ్ బ్లోయర్ ద్వారా శుభ్రపరుస్తారు. సీడ్ డివైడర్ ద్వారా విభజించుకుంటారు. వాటిని మైక్రోస్కోపిక్ లెన్స్‌లో పరిశీలించి అందులోని పుచ్చులను తొలగించి మిగిలినవి తీసుకుంటారు. వాటిని తడిపి జెర్మినేషన్ పేపర్లలో చుట్టి ఆ నాలుగు చుట్టలను సీడ్ జెర్మినేటర్‌లో ఉంచుతారు. నిర్దేశిత రోజులు అనంతరం ఎన్ని విత్తనాలు మొలకెత్తాయో పరిశీలించి వాటి నాణ్యతను గుర్తిస్తారు. అలాగే ఎరువుల్లో రకాలను అనుసరించి వాటిని హాట్ ఎయిర్ ఓవెన్‌లో ఏకరీతి ఉష్ణోగ్రతలో ఉంచుతారు. అనంతరం మఫల్ ఫర్నస్‌లో మండించి బూడిద చేసి రసాయనాల్లో కలపడం ద్వారా ఎరువులు నాణ్యత తేలుస్తారు.

త్వరితగతిన నివేదిక



విత్తన నాణ్యతను పరిశీలించడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లో ఉంది. వారం నుంచి పది రోజుల్లోపే విత్తన నాణ్యతపై నివేదిక అందిస్తున్నాం. నాణ్యతను పరిశీలించుకొని సాగు చేసుకుంటే మంచిది.

– జలంధర్, సీడ్ అనలిస్ట్, అగ్రిల్యాబ్, నగరి

పరీక్షించి తేలుస్తాం



ఎరువులు మంచివో, నకిలీవో పరీక్షించి తేలుస్తాం. రైతులకు ఎరువుల నాణ్యతపై ఎలాంటి సందేహాలు వచ్చినా వాటిని పరిశీలించుకోవచ్చు. నకిలీ ఎరువులు వినియోగించి నష్టపోవాల్సిన అవసరం లేదు.

– సెందామరం, ఫెర్టిలైజర్ అనలిస్ట్, అగ్రిల్యాబ్, నగరి

పంట ఏపుగా ఉంది



వేరుశనగ విత్తనాలను అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లో పరీక్షించుకున్నా. వారు పది రోజుల్లో విత్తనాలు బాగున్నాయని, వాడుకోవచ్చని నివేదిక ఇచ్చారు. ఆ విత్తనాలతోనే పంట సాగుచేశా. పంట ఏపుగా పెరిగింది.

– శివలింగం రెడ్డి, రైతు, నింద్ర

ఉచితంగా పరీక్షలు



నకిలీ విత్తనాలు, ఎరువుల వల్ల రైతులు నష్టపోకుండా చూడడానికే అగ్రి ల్యాబ్‌లను ప్రభుత్వం ఏర్పాటుచేస్తోంది. విత్తనాలు, ఎరువులు పరీక్షించుకోదలచిన వారు కొనుగోలు చేసిన బిల్లులు తెస్తే పరీక్ష ఉచితంగా చేయిస్తాం.

– డి.మల్లికార్జునయ్య, డీడీఏ, చిత్తూరు

క్లుప్తంగా

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నేత మృతి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం


విజయకుమార్ (ఫైల్)

పిచ్చాటూరు: నాగలాపురానికి చెందిన మాజీ ఎంపీపీ, మొదలియార్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కల్పన భర్త విజయకుమార్(50) శుక్రవారం వేకువ జామున గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. సమాచారం అందుకున్న జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్‌కుమార్ నాగలాపురంలోని మృతుని స్వగృహానికి చేరుకొని విజయ్‌కుమార్ భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించి ఓదార్చారు. సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నాగలాపురం చేరుకొని విజయకుమార్ మృతదేహానికి గజమాలతో నివాళి అర్పించారు. మృతుని భార్య కల్పన, పిల్లలకు తన సానుభూతిని తెలియజేశారు. విజయకుమార్ పార్టీ ఆవిర్భావం నుంచి నాగలాపురంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, ఆయన లేనిలోటు పార్టీకి తీర్చలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అపరంజిరాజు, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, వైఎస్సార్ టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్ఎం సురేష్, సచివాలయ మండల కన్వీనర్ మోహన్ మొదలి, నాయకులు పాల్గొన్నారు.

పరిపాలనలో ప్రత్యేక శైలి

- రెండేళ్లకు పైగా జిల్లాలో కలెక్టర్ హరినారాయణన్ విధులు
- పకడ్బందీగా అభివృద్ధి.. సంక్షేమ పథకాల అమలు
- నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు


క్షేత్రస్థాయి పర్యటనలో కలెక్టర్ హరి నారాయణన్ (ఫైల్)


నెల్లూరు జిల్లాకు బదిలీ అయిన కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు కలెక్టరేట్ : నిజాయితీ, నిరాడంబరత, మానవీయత, నైతికతకు నిలువెత్తు నిదర్శనం కలెక్టర్ హరినారాయణన్. తమిళనాడులోని తిరుకోయిలూరులో మురుగన్, గీత దంపతులకు ఆయన జన్మించారు. 2010లో సివిల్ సర్వీసెస్ పరీక్షలకు హాజరై ఆల్ ఇండియా 27వ ర్యాంక్ సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. విధుల్లో చేరినప్పటి నుంచి బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు వద్దకు పరిపాలన తీసుకెళ్లడంతో విజయవంతమయ్యారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా చివరి కలెక్టర్‌గా, పునర్విభజన అనంతరం జిల్లా తొలి కలెక్టర్‌గా సమర్థవంతంగా సేవలందించారు. జిల్లాలో ఆయన రెండేళ్లకు పైగా విధులు నిర్వర్తించారు. శుక్రవారం ఆయనను శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆయన సేవలు ఇలా..

జిల్లా కలెక్టర్ గా ఆయన బాధ్యతలు స్వీకరించినప్పుడు కరోనా మహమ్మారి విజృంభిస్తోంది. ఆ సమయంలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలందడంతో కలెక్టర్‌గా హరినారాయణన్ కీలకపాత్ర పోషించారు. ఆస్పత్రుల్లో పకడ్బందీగా వసతులు కల్పించడం, వైద్యులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడంలో విశేషంగా కృషి చేశారు. తిరుపతి జిల్లాలో నిర్వహించిన ఉమ్మడి రాష్ట్రాల సదస్సును విజయవంతంగా నిర్వహించారు. గత ఏడాది కురిసిన భారీవర్షాలకు చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రాపురం వద్ద ఉన్న చెరువు కట్ట తెగే పరిస్థితులు తలెత్తడంతో రాత్రింబవళ్లు అక్కడే ఉండి మరమ్మతులు చేయించారు. కొత్త పరిశ్రమలు, డీఆర్‌డీఓ స్థాపనకు అవసరమైన భూ సేకరణ, చిత్తూరు–తచ్చూరు, ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు పనులు పురోగతికి శ్రమించారు. స్పందన అర్జీల పరిష్కారం, గృహ నిర్మాణాలు, నాడు–నేడు పనుల పురోగతిలో జిల్లా ముందంజ నిలిపారు.

కలెక్టర్‌గా షన్‌మోహన్



జిల్లా కలెక్టర్‌గా నియమితులైన సగిలి షన్‌మోహన్ అనంతపురం జిల్లా వాసి. ఆయన పదోతరగతి వరకు అన్నమయ్య జిల్లా రాయచోటిలో చదువుకున్నారు. ఇంటర్ హైదరాబాద్‌లో పూర్తిచేశారు. 2007 నుంచి 2011 వరకు బిట్స్‌పిలానీలో ఈఈఈ చదివారు. 2011 నుంచి 2013 వరకు అహ్మదాబాద్ లోని ఐఐఎంలో ఎంబీఏ పూర్తి చేశారు. అనంతరం సివిల్స్ లో ఎంపికై 2013లో ఐఏఎస్ అయ్యారు. ప్రకాశం జిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా, జాయింట్ కలెక్టర్ గా పనిచేసిన అనంతరం రాష్ట్ర స్థాయిలో వివిధ పోస్టులలో ఆయన పనిచేశారు. తొలిసారిగా ఆయన చిత్తూరులో కలెక్టర్‌గా విధులు నిర్వహించనున్నారు. సోమవారం నూతన కలెక్టర్ బాధ్యతలు చేపట్టే అవకాశాలున్నట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు.

జాయింట్ కలెక్టర్‌గా పులి శ్రీనివాసులు..



2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన పులి శ్రీనివాసులును ప్రభుత్వం చిత్తూరు జాయింట్ కలెక్టర్‌గా నియమించింది. ఇక్కడ పనిచేస్తున్న వెంకటేశ్వర్‌ను ఏపీ వైద్యవిధాన పరిషత్ కమిషనర్‌గా బదిలీ చేసింది.


చిత్తూరు బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.77,000
రిటైల్ వెండి గ్రాము	రూ.77

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


రవీందర్ మృతదేహం

నగరి : మండలంలోని డీవీఆర్ కండ్రిగ వద్ద శుక్రవారం విద్యుదాఘాతానికి గురై రవీందర్ (22) అనే యువకుడు మృతి చెందాడు. వివరాలు.. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా, వులవనూరు మండలం, బంజారా గ్రామానికి చెందిన రవీందర్ విద్యుత్ సబ్ కాంట్రాక్టు పనుల్లో ఉన్నాడు. ఈ క్రమంలో 11 కేవీ లైన్ ఆఫ్ చేసి ఉందనుకుని విద్యుత్ పనులు చేయబోగా షాక్ తగిలి అక్కడికక్కడే మరణించాడు. వీఆర్‌ఓ ప్రభాకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మోసం చేశాడని ప్రియుడిపై ఫిర్యాదు


నక్షత్ర, ఆకాష్ నిశ్చితార్థ దృశ్యం (ఫైల్) (ఇన్‌సెట్) వీల్‌చైర్‌లో నక్షత్ర

కుప్పం : ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేశాడని, తనకు న్యాయం చేయాలని ఓ యువతి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు.. పట్టణంలోని ఆజాద్ రోడ్డుకు చెందిన మణి కుమార్తె నక్షత్ర బెంగళూరులో డిగ్రీ చదువుతోంది. అలాగే స్థానిక జయప్రకాష్‌రోడ్డుకు చెందిన మూర్తి కుమారుడు ఆకాష్ తరచూ నక్షత్ర వెంటపడేవాడు. ప్రేమిస్తున్నానని చుట్టూ తిరిగేవాడు. కొన్నాళ్లకు అతడి మాటలు నమ్మిన యువతి ప్రేమలో పడింది. ఈ విషయం తెలుసుకున్న ఇరువురి కుటుంబీకులు వారి వివాహానికి అంగీకరించారు. అయితే అమ్మాయి చదువు పూర్తయిన తర్వాత పెళ్లి చేద్దామని నక్షత్ర తల్లిదండ్రులు చెప్పడంతో, ముందు నిశ్చితార్థం జరిపించారు. ఈ క్రమంలో ఏడాది నుంచి ఆకాష్ మరో యువతితో ప్రేమ వ్యవహారం నడుపుతున్నట్లు నక్షత్రకు తెలిసింది. దీనిపై ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. సమస్యలు పరిష్కరించుకుందామని ఒకరోజు ఆకాష్ తన వెంట నక్షత్రను బెంగళూరులో ఓ భవనం పైకి తీసుకెళ్లాడు. మాట్లాడుతున్నట్లు నటిస్తూ ఆమెను కిందకు తోసేశాడు. దీంతో నక్షత్ర తీవ్రంగా గాయపడింది. కాలు విరిగిపోవడంతో వీల్‌చైర్‌కే పరిమితమైంది. ఇదే సాకుగా చూపుతూ ఆకాష్, తల్లిదండ్రులు అడ్డంతిరిగారు. నడవలేని అమ్మాయిని పెళ్లి చేసుకోలేమని తేల్చిచెప్పేశారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

వరసిద్ధుని సేవలో ప్రముఖులు


ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ కుమార్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీదేవి, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి కృష్ణమోహన్ కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేశారు. ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వదించారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు, బాలాజీ నాయుడు, తహసీల్దార్ శ్రీదేవి, చిత్తూరు వెస్ట్ సీఐ శ్రీనివాసులురెడ్డి, తవణంపల్లె ఎస్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.


తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీదేవి కుటుంబ సభ్యులకు చిత్రపటం అందిస్తూ..


కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌కుమార్‌కు జ్ఞాపిక అందిస్తూ..

కారు, లారీ ఢీ


నుజ్జునుజ్జు అయిన కారు


ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ కోటేశ్వరరావు

శ్రీకాళహస్తి రూరల్: కారు–లారీ ఢీకొని ఒకరు మృతిచెందగా మరో నలుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం శ్రీకాళహస్తి మండలంలో చోటుచేసుకుంది. శ్రీకాళహస్తి రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం.. తెలంగాణ రాష్ట్రం, భద్రాది కొత్తగూడెం జిల్లా, అశ్వపురం గ్రామానికి చెందిన కొప్పాల శ్రీనివాసరావు కుటుంబం తిరుమల శ్రీవారి దర్శనానికి బయలుదేరింది. శ్రీకాళహస్తి మండలంలోని పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి చెర్లోపల్లి గ్రామం వద్దకు చేరుకోగానే తిరుపతి నుంచి శ్రీకాళహస్తి వైపు వస్తున్న లారీ కారును ఢీకొట్టింది. దీంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవింగ్ చేస్తున్న కోటేశ్వరరావు(45) అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ప్రయాణిస్తున్న శ్రీనివాసరావు(47), నాగమణి(37), యామిని(17), ధనుష్(19), విష్ణు(14) పెద్ది తరుణ్(20)కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అక్కడి వైద్యులు తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. కేసు నమోదుచేసి మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అధిక వడ్డీ ఆశచూపి.. బోర్డు తిప్పేశారు!


మీడియాతో మాట్లాడుతున్న బాధితులు

చిత్తూరు అర్బన్ : అధిక వడ్డీ ఇస్తామని ఆశపెట్టి నగదు డిపాజిట్ చేయించుకుని, తిరిగి చెల్లించాల్సిన సమయం వచ్చేసరికి మోసం చేశారని చిత్తూరుకు చెందిన బాధితులు ప్రసాద్, గోవిందరాజులు, కేశవర్ధన్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. పట్టణంలోని కొంగారెడ్డిపల్లెలో ఏఆర్‌టీ అనే సంస్థ బంగారు నగలను కుదువ పెట్టుకుని రుణం ఇచ్చేదన్నారు. తిరుపతిలో కూడా ఈ సంస్థకు బ్రాంచ్ ఉందని తెలిపారు. ఆభరణాలపై రుణం ఇవ్వడంతోపాటు రూ.లక్ష డిపాజిట్ చేస్తే నెలకు రూ.3వేల వడ్డీ ఇస్తామని సంస్థ నిర్వాహకులు నమ్మబలికారని వెల్లడించారు. దీంతో తామందరం డబ్బు కట్టామని, మూడు నెలల పాటు సక్రమంగా వడ్డీ చెల్లించారని వివరించారు. తర్వాత వడ్డీ మొత్తాన్ని కూడా అసలులో కలుపుతామని, ఏడాదికి ఇంకా ఎక్కువ నగదు వస్తుందని మళ్లీ ఆశపెట్టారని చెప్పారు. దీపావళి చీటి, దసరా స్కీమ్ పేరిట మమ్మల్ని పూర్తిగా నమ్మించి చివరకు నట్టేట ముంచారని వాపోయారు. చెన్నైలో కూడా ఈ సంస్థ బోర్డు తిప్పేసినట్లు తెలిసిందని, తమిళనాడు పోలీసులు సైతం వీరి కోసం వెతుకుతున్నారన్నారు. తామే కాకుండా చిత్తూరులో సుమారు 300 మంది వరకు వీరి చేతిలో మోసపోయారని, దాదాపు రూ.కోటి వరకు డిపాజిట్లు తీసుకుని సంస్థ నిర్వాహకులు పారిపోయారని వెల్లడించారు. అధికారులు దీనిపై స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. అయితే దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలియజేస్తున్నారు.

రెండిళ్లలో చోరీ

– రూ.10లక్షల సొత్తు అపహరణ

చిత్తూరు అర్బన్: నగరంలో గురువారం రాత్రి ఒకే అపార్టుమెంటులోని రెండు ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సుమారు రూ.10లక్షల సొత్తును అపహరించారు. వన్‌టౌన్ సీఐ నరసింహరాజు కథనం మేరకు.. నగరంలోని మైదా ఫ్యాక్టరీ రోడ్డులో ఉన్న నీమ్‌గార్డెన్‌కు చెందిన హనుమంతరావు ఇటీవల బెంగళూరులోని తన బంధువుల ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం వచ్చి చూసేసరికి మొదటి అంతస్తులోని ప్లాట్‌లో తాళాలు పగులగొట్టి ఉంది. లోపల బీరువాలో ఉన్న 175 గ్రాముల బంగారు ఆభరణాలు, 150 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.2.08 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. అలాగే కింది ప్లాట్‌లో ఉన్న రామ్మూర్తి అనే వ్యక్తి సైతం ఊరికి వెళ్లడంతో ఆయన ఇంట్లో ఉన్న 350 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.10 వేల నగదు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎస్వీ వేద వర్సిటీలో ఆస్ట్రాలజీ కోర్సు

- డయల్ యువర్ ఈఓలో ధర్మారెడ్డి


డయల్ యువర్ ఈఓలో మాట్లాడుతున్న ధర్మారెడ్డి

తిరుమల: తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో ఆస్ట్రాలజీ, అకల్ట్ సైన్సెస్ విభాగాన్ని ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపడుతున్నామని టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న : నేత్రదాన ట్రస్టును ప్రారంభించి కార్నియా దానం చేయండి. – రవి, కావలి

ఈవో : అరవింద ట్రస్టుతో ఒప్పందం చేసుకుని తిరుపతిలో నేత్ర వైద్య సేవలు అందిస్తున్నాం. వారితో చర్చించి ఐ బ్యాంకు ఏర్పాటుకు కృషి చేస్తాం.

ప్రశ్న : వీఐపీ సిఫారసు లేఖలపై బ్రేక్ దర్శనాలు కేటాయించడం తగ్గించండి. రూ.300 దర్శన టికెట్లు రెండు నెలల ముందుగానే కేటాయించండి. – శంకర్, హైదరాబాద్

ఈవో : ఇది ప్రభుత్వ పరిధిలోని అంశం. వేసవి నేపథ్యంలో ఈ నెలలో రూ.300 దర్శన టికెట్ల కోటా తగ్గించి మార్చి నెలలో విడుదల చేశాం. ఈ నెలలో మే, జూన్ టికెట్లను విడుదల చేస్తాం.

ప్రశ్న : లక్కీడిప్‌లో ఆర్జిత సేవా టికెట్ వచ్చింది. అరగంట లేటుగా వెళ్లినందుకు టికెట్ రద్దు అయింది. గూగుల్ పే ప్రవేశపెట్టండి. నడకదారిలో టికెట్ పొందితే కొండపై లక్కీడిప్‌లో సేవలకు నమోదు చేసుకోవచ్చా. – గోవర్ధన్, జగిత్యాల

ఈవో : లక్కీడిప్‌లో సేవా టికెట్ పొందిన భక్తులు సొమ్ము చెల్లించేందుకు గూగుల్ పే, ఫోన్ పే విధానాన్ని ప్రవేశపెడతాం. నడకదారిలో దర్శన టికెట్‌కు, లక్కీడిప్‌లో సేవా టికెట్‌కు ఎలాంటి సంబంధం లేదు.

ప్రశ్న : తిరుమలకు కాలినడకన వచ్చాము. క్యూలైన్లలో ఎక్కువ దూరం నడవాల్సి వస్తోంది. – ఎర్ర మల్లయ్య, మదనపల్లి

ఈవో : ఈ నెల 1 నుంచి నడక మార్గంలో వచ్చే భక్తులకు టైమ్ స్లాట్ టోకెన్లు జారీ చేస్తున్నాం. వీటిని పొందితే నిర్దేశిత సమయంలో స్వామిని దర్శించుకోవచ్చు. నడక మార్గాల్లో అవసరమైన చోట్ల తాగునీటి వసతి కల్పిస్తాం.

ప్రశ్న : అంగప్రదక్షిణ టోకెన్లు ఆఫ్ లైన్లో కొన్ని ఇవ్వండి. –సరితా రెడ్డి, కరీంనగర్

ఈవో : ఈ టికెట్లు పరిమితం కాబట్టి ఆఫ్‌లైన్‌లో ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తోంది. భక్తుల కోరిక మేరకే ఆన్‌లైన్‌లో విడుదల చేస్తున్నాం.

ప్రశ్న : శుక్రవారం నిజపాద దర్శనం సేవను పునరుద్ధరించండి.– జగదీష్, వేలూరు

ఈవో : సామాన్య భక్తులకు దర్శనం కల్పించడంతోపాటు స్వామివారి నైవేద్యం ఆలస్యం కాకుండా ఉండేందుకే శుక్రవారం రోజు జారీ చేసే నిజపాద దర్శనం సేవా టికెట్లను టీటీడీ బోర్డు తాత్కాలికంగా రద్దు చేసింది.